ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 23 మే 2025 | 5



కాకినాడ
ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33 (గురువారం)
కనిష్ఠం : 27

ఏలేరు కాల్వల గండ్లు అన్నింటినీ వర్షాకాలానికి ముందే పూడ్చాలి
మంత్రి నారాయణ
6



అంతా ఒక్కటై : కాకినాడ జిల్లా మహానాడు వేదికపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, కొండబాబు, వరుపుల సత్యప్రభ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ రాజశేఖరం, చిక్కాల రామచంద్ర రావు, వర్మ, మహాసేన రాజేష్, పిల్లి సత్యనారాయణ మూర్తి తదితరులు

మహా పండుగ

కాకినాడలో ఘనంగా టీడీపీ మినీ మహానాడు

కాకినాడ బీచ్‌లో ఎన్‌టీఆర్ విగ్రహం
కాకినాడ జీజీహెచ్ ఆధునీకరణ
కార్యకర్తలకు అండగా ఉందాం : మంత్రి
కార్యకర్తలను విస్మరించవద్దు : నెహ్రూ



ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి నారాయణ, చిక్కాల రామచంద్రరావు, పిఠాపురం ఇన్‌చార్జి వర్మ తదితరులు

కాకినాడ, మే 22, (ఆంధ్రజ్యోతి):ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ వెల్లడించారు. కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో గురువారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన కాకినాడ జిల్లా మినీమహానాడు నిర్వహించారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పార్టీకి వెన్నెముకగా నిలిచిన కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు. పార్టీ ముఖ్యనేతలు కొందరు కార్యకర్తల గురించి కాస్త ఆవేదనగా మాట్లాడడంపై ఆయన స్పందించారు.పార్టీ విజయానికి కృషి చేసిన వారందరికీ గుర్తింపు తీసుకువచ్చేలా పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, లోకేశ్‌ల దృష్టికి తీసుకువెళతామన్నారు.2047 నాటికి దేశంలో మన రాష్ట్రం అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలిపేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఎన్టీఆర్ పాటించిన విధివిధానాలే నేటికీ పార్టీ మనుగడకు మూలం అన్నారు. పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేసిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. కార్యకర్తల ఉనికిని కాపాడాలని కోరారు. కాకినాడ జిల్లాలో పార్టీ పరిస్థితి అసలు బాగోలేదన్నారు. ఒకేపార్టీకి పదవులు కట్టబెట్టడం సరైన విధానం కాదని..ఒకే వ్యక్తికి రెండు పదవులు ఇవ్వడం కూడా భావ్యం కాదన్నారు. ఎంపీ సానా సతీష్‌బాబు మాట్లాడుతూ కాకినాడ జిల్లా అభివృద్ధికి, ఎస్ఈ జెడ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామన్నారు. ఎస్ఈజెడ్‌లో పెట్రోలియం కారిడార్‌పై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.కాకినాడలో 11 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌ను 2500 బెడ్స్‌తో ఆధునికీకరిస్తామన్నారు.కాకినాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.జ్యోతుల నవీన్ మాట్లాడుతూ కార్యకర్తలను విస్మరించవద్దని సూచించారు. ప్రతి కార్యకర్తను కాపాడుకోవాల్సిన బాధ్యత అధిష్ఠానంపై ఉందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్ సిటీ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని కోరారు. పెద్దాపురం ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, అలాగే డీగ్రీ కాలేజీ కావాలని, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని, ఆనూరు, కొండపల్లి గ్రామాలకు నీరు ఇవ్వాలని కోరారు. టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ మాట్లాడుతూ కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ప్రజలకు అండగా నిలిచే పార్టీ టీడీపీ అన్నారు. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మమాట్లాడుతూ ఏలేరు ఆధునీకరణ చేపట్టాలని, పురుషోత్తపట్నం పనులు చేపట్టాలని కోరారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కాకినాడ రూరల్‌లోని ఆరు కీలక పంచాయతీలను విలీనం చేయకపోతే పంచాయతీ ఎన్నికలైనా నిర్వహించాలని కోరారు.కాకినాడ బీచ్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేశారు. కాకినాడ జిల్లాలో పార్టీ నేతలకు పదవుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మినీ మహానాడుకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ఉదయం ఎనిమిదిగంటలకే సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది. చాలా మంది బయటే ఉండిపోయారు. స్క్రీన్‌లపై కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో తోట నవీన్,వనమాడి మోహన్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, కటకంశెట్టి బాబీ, పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు, చప్పిడి వెంకటేశ్వరరావు, మల్లిపూడి వీరు,తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, పోతుల మోహనరావు, తుమ్మల సునీత, నల్లారి తులసి, రామదేవు సీతయ్య దొర, సబ్బతి ఫణీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలివీ : ఏలేరు ఫేజ్-2 (సుద్దగడ్డ కొండకాలువ) పనులు ప్రారంభించాలి.యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో ఎన్‌టీపీసీకు సేకరించిన సుమారు 600 ఎకరాల భూమిని రూ.వెయ్యికోట్లకు యాజమాన్యం విక్రయించుకుంది.సంస్థ రైతులను మోసగించి, ఏ కంపెనీ నిర్మాణాలు చేయకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. కేఎస్ఈజెడ్‌లోని అరబిందో, ఇతర ఫార్మాస్యూటికల్ కంపెనీల ద్వారా వచ్చే కాలుష్యాన్ని నిర్మూలించి, మత్స్యకారుల ఉపాధిని కాపాడాలి.కేఎస్ఈజెడ్ భూమి రైతులకు అదనంగా ఇచ్చినట్టు ఈ రైతులకు చెల్లింపులు చేయాలని తీర్మానించారు.



కిక్కిరిసిన మినీ మహానాడు సభా హాలు



ఎంపీ సానా | ఎమ్మెల్యేలు కొండబాబు, సత్యప్రభ, చినరాజప్ప | జ్యోతుల నెహ్రూ | ఎస్వీఎస్ఎన్ వర్మ | పిల్లి సత్తిబాబు | జ్యోతుల నవీన్ | మహాసేన రాజేష్ | చిక్కాల | వేదికపై మాట్లాడుతున్న పలువురు తెలుగుదేశం నాయకులు

కొవిడ్ పై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ) మే 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రజలు కొవిడ్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డిఎంహెచ్‌వో) డాక్టర్ జె.నరసింహ నాయక్ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సూచించారు. కొన్ని దేశాల్లో కొవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు, ఎయిర్‌పోర్ట్‌లలో కొవిడ్ - 19 నిబంధనలను విధిగా పాటించాలన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, గర్భిణీలు అత్యవసరమైతేనే తప్ప ఇంటి నుంచి బయటికి రాకపోవడం శ్రేయస్కరమన్నారు. చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మాస్క్ ధరించి, సామాజిక దూరం పాటించాలన్నారు. తద్వారా వైరస్‌ను అదుపులో ఉంచవచ్చన్నారు. ముఖ్యంగా ఎదుటవారితో కరచాలనం చేయరాదన్నారు. గాలి, వెలుతురు ఉన్న ప్రదేశాల్లో నివసించాలన్నారు. అనుమానం ఉన్న వ్యక్తులు సమీప ఆసుపత్రుల్లో వైద్యాధికారి సూచనలు మేరకు తగిన మందులు వాడాలన్నారు. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తులు తప్పనిసరిగా సెల్ఫ్ ఐసోలేషన్ లో ఉండాలన్నారు. జ్వరం, రొంప, దగ్గు, గొంతునొప్పి, నాలుక రుచి లేకపోవడం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, ముక్కు కారడం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనబడితే అర్హులైన వైద్యుల సూచనలు పాటించాలని, ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో ఎటువంటి కొవిడ్ కేసులు నమోదు కాలేదని డాక్టర్ నాయక్ కోరారు.

జిల్లాలో మరో మూడు అన్న క్యాంటీన్లు

కలెక్టరేట్(కాకినాడ), మే 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో మరో మూడు అన్నక్యాంటీన్ల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం రూ.1.83కోట్లు నిధులు విడుదల చేసింది. దీనిలో కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం, జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేటలో, పిఠాపురం నియోజకవర్గంలో యూ.కొత్తపల్లిలో ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క అన్న క్యాంటీన్‌కు రూ.61 లక్షల చొప్పున కేటాయించారు. జగ్గంపేటలో అన్న క్యాంటీన్‌కు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. మరో మూడు నెలల్లో వీటి నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న బిందుమాధవ్

హెల్ప్‌డెస్క్‌ల పనితీరు మెరుగుపడాలి : ఎస్పీ

కాకినాడ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసం ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌ల పనితీరును మరింత మెరుగుపరచాలని ఎస్పీ జి బిందుమాధవ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన గురువారం నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వంటి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏజన్సీ బోర్డర్‌ల వద్ద ఉన్న పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చెక్ పోస్ట్‌లను ఏర్పాటుచేసి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేయాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు రాత్రి సమయాల్లో హైవేలలో స్టాప్-వాష్ అండ్ గో కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. పబ్లిక్‌గా స్మోకింగ్ చేస్తూ పట్టుబడితే భారీగా జరిమానాలు విధించాలన్నారు. ఇక పాత గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సోకేసులు, రేప్ కేసులు, ఎన్‌డీపీఎస్ కేసులు, సైబర్ క్రైం, మిస్సింగ్ కేసులపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఐజీ ఉమెన్స్ సేఫ్టీ ఆదేశాలను అధికారులకు వివరించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలపై జరిగే క్రైమ్స్‌ను అన్ని శక్తి పోర్టల్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. పోక్సో, రేప్ కేసుల్లో బాధితులను విచారించే సమయంలో శక్తి టీమ్‌లను వినియోగించుకోవాలన్నారు. ఆ తరహా కేసుల్లో 60 రోజులలోపు చార్జ్‌షీట్ వేయాలని, ఆలస్యం అయితే ఉన్నతాధికారులకు తెలియపర్చాలన్నారు. మంచి పనితీరు కనబర్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి, వలంటీర్లకు ఎస్పీ ప్రశంసపత్రాలందించారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్‌పాటిల్, పెద్దాపురం ఎస్ డీపీవో శ్రీహరి రాజు, ట్రైనీ డీఎస్పీ జీవన, ఎస్‌బీడీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కలలోను!



కార్పొరేషన్ రుణాలకు స్మాల్ బ్రేక్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న స్వయం ఉపాధి రుణ యూనిట్లకు బ్రేక్ పడింది. వీటిని తక్షణం నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ, రుణం మంజూరు ఆపేయాలని సూచించింది. త్వరలో భారీగా అదనపు రుణ యూనిట్లు, లబ్ధిదారులను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.



వందల్లో యూనిట్లు.. వేలల్లో దరఖాస్తులు

ఐదేళ్ల తర్వాత మళ్లీ పథకం అమల్లోకి రావడంతో యూనిట్లు వంద ల్లో ఉంటే దరఖాస్తుదారులు వేలల్లో వచ్చారు. బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147మంది పోటీపడ్డారు.కాపు కార్పొరేషన్ కింద రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీ పడ్డారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మంజూరు చేయగా, రూ.6 వేల మంది వరకు దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూరవగా 5,497, కోన సీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు.

5,137 యూనిట్లు..


గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేదలకు ఒక్క యూనిట్ కూడా మంజూరు చేయకుండా ఆపేసింది. ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ఇటీవల వీటిని పునరుద్ధరించింది. సీఎం చంద్రబాబు మళ్లీ కార్పొరేషన్ల ద్వారా బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ రెండు కార్పొరేషన్ల ద్వారా రూ.316 కోట్ల విలువైన స్వయం ఉపాధి యూనిట్లను పేద యువతకు అందించి వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు నిర్ణయించింది. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఉమ్మడి జిల్లాకు 5,137 యూనిట్లను మంజూరు చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. ఏకంగా 45,765 మంది పోటీపడ్డారు. అనేకమందికి పథకం అందని పరిస్థితి నెలకొంది. ఈ నేప థ్యంలో మళ్లీ యూనిట్లను పెంచి మరింత మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం అర్హుల ఎంపికను నిలిపివేసి కొత్తగా మరింత మందిని ఎంపిక చేసి అందరికీ ఒకేసారి ఈ పథకం అమలు చేయడం కోసమే తక్షణ నిర్ణయమని చెబుతున్నారు.

లబోదిబో...

ఐదేళ్ల తర్వాత పథకం అమలవుతుండడంతో యూనిట్లను దక్కించుకునేందుకు వేలాదిగా పోటీపడడంతో కేవలం వందల్లో మాత్రమే లబ్ధిదారులు రుణాలకు ఎంపికయ్యారు. ఎంపిక కాని వేలాది మంది పేద యువత, నిరుద్యోగులు తమకు న్యాయం చేయాలంటూ అనేక చోట్ల ఎమ్మెల్యే వద్దకు క్యూ కట్టారు. ఇన్నేళ్లు నిరీక్షిస్తే తమకు ఇంకెప్పుడు న్యాయం జరుగుతుందంటూ విజ్ఞప్తులు అందించారు. దీంతో అనేక మంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వందల్లో రుణ యూనిట్లు సరిపోవని వివరించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులపై అధికారుల ద్వారా నివేదిక రప్పించుకున్న ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇవి రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభు త్వంలో జరిగింది. రెట్టింపు చేయాలా? ఇంకా పెంచాలా? అనేదానిపై ప్రస్తుతం ఉన్నత స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ఈ సంగతి తేల్చే వరకు ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధి దారుల జాబితా నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికీ ఒకేసారి పథకం వర్తింపజేయాలని జిల్లాల్లో అధికారులకు సమాచారం అందింది. దీంతో ప్రస్తుతం మండల స్థాయిలో పథకాలకు ఎంపికై బ్యాంకు రుణాలకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులను హోల్డ్‌లో ఉంచారు. ఈ నేప థ్యంలో బీసీ కార్పొరేషన్ కింద మంజూరైన 1,042, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద మంజూరైన 73, కాపు కార్పొరేషన్ కింద ఎంపికచేసిన 570 లబ్ధిదారులను నిలిపివేశారు. త్వరలో భారీ స్థాయిలో యూనిట్లను పెంచి ఎక్కువమంది యువతకు పథకాన్ని అమలుచేయనుంది.

- కలవరింత... పెంపు మరింత
- జాబితాలు నిలిపేయాలని ఆదేశం
- యూనిట్లు తక్కువవడమే కారణం
- కార్పొరేషన్లకు 5,137 యూనిట్లు
- 45,765 దరఖాస్తులు
- వందల్లో ఎంపికైన లబ్ధిదారులు
- అనేక మందికి దక్కని అవకాశం
- ఎమ్మెల్యేలను నిలదీస్తున్న వైనం
- పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి
- త్వరలో భారీగా పెంచే యోచన
- యూనిట్ల పెంపుపై కసరత్తు
- అందుకే నిలిపివేసిన ప్రభుత్వం

కిలో నెయ్యి.. రూ.250



కల్తీ నెయ్యి

ఆత్రేయపురం పూతరేకుల్లో కల్తీ నెయ్యి

- విచ్చలవిడిగా అమ్మకాలు
- పూతరేకుల్లో వినియోగం
- పశువుల కొవ్వు నుంచి తయారీ
- చిరు వ్యాపారులతో అమ్మకాలు
- ప్రజారోగ్యంతో చెలగాటం

ఆత్రేయపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది పూతరేకులే.. రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం.. ఆ వ్యాపారానికి నెయ్యి ఎక్కడి నుంచి వస్తుందనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే నెయ్యి వాడని పూతరేకు ఉండదు. ఎన్నో ఏళ్ల కిందట ఆత్రేయపురంలో పుట్టిన పూతరేకుకు దేశ విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. మహిళలు కుటీర పరిశ్రమగా పూతరేకులు తయారుచేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పూతరేకులకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ పూతరేకుల వ్యాపారాలు సాగిస్తూ కల్తీ నెయ్యి వినియోగిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురంలో రోడ్ల వెంబడి ఉన్న దుకాణాల్లో కొందరు వ్యాపారులు గత కొంతకాలంగా యథేచ్ఛగా నకిలీ నెయ్యిని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. పశుమాంసం ద్వారా కొవ్వును తీసి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒరిజినల్ నెయ్యిలా ఉండేలా కొన్ని మిశ్రమాలు కలిపి ఈ కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నట్టు సమాచారం. ఏలూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఈ నకిలీ నెయ్యిని తెచ్చి వ్యాపారుల ద్వారా అమ్మకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురంలోని కొన్ని షాపుల ద్వారా ఈ నెయ్యి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. ఈ కల్తీ నెయ్యిని కిలో రూ.250కు చిరువ్యాపారులకు విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండడం.. చూస్తే నెయ్యిలా కనిపించడంతో ఆ నెయ్యినే వినియోగించి కొందరు పూత రేకులు తయారుచేస్తున్నారు. ఈ కల్తీనెయ్యి విచ్చలవిడిగా వినియోగించడం ద్వారా ప్రజలు ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. క్యాన్సర్, ఉదర సంబంధిత వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. గత ఫిబ్రవరి నెలలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పూతరేకుల తయారీ, నెయ్యి వ్యాపారుల స్థావరాలపై దాడులు చేసి కేసులు పెట్టినా షరామామూలే.



అధికారులు పట్టుకున్న కల్తీ నెయ్యి

80 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

ఆత్రేయపురంలోని కల్తీ నెయ్యి అమ్మకాలు సాగిస్తున్న ఓ షాపుపై స్థానికులు గుర్తించి పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అం దించారు. ఆత్రేయపురం శ్రీలక్ష్మి డ్రైఫ్రూట్స్ షాపులో గురువారం 80 కిలోల కల్తీనెయ్యిని పట్టుకుని స్థానికులు పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. షాపునకు చెందిన గొడౌన్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 80 కిలోల కల్తీనెయ్యిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రాము ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీకాంత్‌చౌదరి కల్తీ నెయ్యి సీజ్ చేశారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.



సంచుల్లో నిల్వ ఉంచిన కల్తీ నెయ్యి ప్యాకెట్లు

జలకాలాటలలో...

నగరాలు, పట్టణాల్లో ఉండే పిల్లలకు ఎంజాయ్ చేయడానికి స్విమ్మింగ్ పూల్స్ ఉంటాయి... మరి మారుమూల పల్లెల్లో నివసించే పిల్లలకు చెరువులు, కాలువలే ఆధారం... ఈ చిత్రం చూస్తే అలానే అనిపిస్తోంది కదూ... కాకినాడ జిల్లా తుని మండలం గవరపేటకు చెందిన కుర్రాళ్లు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఊరి చివరన ఉన్న ఓ పురాతన బావిలోకి దూకి ఇలా స్నానాలు చేస్తూ సందడి చేశారు.





ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ. చిత్రంలో కలెక్టర్ షాన్‌మోహన్, పెద్దాపురం, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు చినరాజప్ప, నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ కమిషనరు భావన

ఏలేరు కాల్వల గండ్లు అన్నింటినీ

వర్షాకాలానికి ముందే పూడ్చాలి

- గత సమావేశంలో చర్చించిన అంశాల్లో 75శాతం పూర్తి చేశారు
- పీఎం సూర్యఘర్ కింద 75వేల గృహాలకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలి
- కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ

కలెక్టరేట్ (కాకినాడ), మే 22 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం వరదల కారణంగా ఏలేరు వ్యవస్థలో కాల్వలకు పడిన గండ్లు అన్నింటినీ వర్షాకాలానికి ముందే పూడ్చాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశం గురువారం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీలతో కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. గత డీఆర్సీ సమావేశంలో చర్చించిన అంశాల్లో 75శాతం పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తిచేస్తామని కలెక్టర్ వివరించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలి పథకం కింద 75వేల సోలార్ రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేసామన్నారు. దీనిలో 52వేల యూనిట్లను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇస్తామన్నారు.

కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కిసాన్ డ్రోన్ల వల్ల రైతులకు, డ్రోన్ నిర్వాహకుడికి ఏడాదికి దాదాపు 6.33లక్షల ఆదాయం చేకూరుతుందని అధ్యయనంలో నిర్ధారణ అయ్యిందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల యజమానికి చేకూరే ఆర్థిక ప్రయోజనాలపై క్షేత్ర పరిశీలన చేశామన్నారు. డ్రోన్ల వినియోగం వలన రైతులకు ఖర్చు, సమయం ఆదా అవుతున్నాయన్నారు. జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగమేళాల నిర్వహణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చేపట్టిన చర్యలను మంత్రికి కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ఆవాసాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేపట్టిన చర్యలను కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వివరించారు.

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ గత ఏడాది వరదల వలన ఏలేరు వ్యవస్థలో పడిన గండ్లను వెంటనే పూడ్చించాలన్నారు. సామర్లకోట బైపాస్, ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను సత్వరం పూర్తి చే యాలన్నారు.

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆక్వా చెరువుల వ్యర్థ జలాల వలన పంట పొలాలకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. మిల్లర్లు కుమ్మక్కై తక్కువ ధర చెల్లిస్తున్నందున నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు మరింత ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లను రైతులకు పంపిణీ చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న హాస్టల్ సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. జయలక్ష్మి మాక్ సొసైటీ, కిర్లంపూడి, ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై సత్వరం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ సభ్యులు సమావేశంలో చర్చించిన అంశాలపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ఏలేరు సాగునీటి వ్యవస్థలో కాలువలకు గత ఏడాది వరదల సమయంలో పడిన గండ్లు అన్నింటినీ ఖరీఫ్ సాగుకు ముందే పూడ్చాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద టిడ్కో గృహాలపైన కూడా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పటిష్టమైన వేసవి కార్యాచరణతో బోర్లు రిపేర్లు, నీటి రవాణా వంటి చర్యలతో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు అమ్మే ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలన్నారు. రైతులకు మరిన్ని టార్పాలిన్లు సబ్సిడీపై సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాల్లో 75 శాతం పరిష్కారం అయ్యాయని చెప్పారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. చైత్రవర్షిణి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

పాపికొండలు నేషనల్ పార్కులో

ఎకో అటవీ పరిరక్షణ జోన్

- అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్
- రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ, అటవీ, వివిధ శాఖల అధికారులు

రంపచోడవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు నేషనల్ పార్కులో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ఎకో అటవీ పరిరక్షణ జోన్ ఏర్పాటు చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన రంపచోడవరంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్‌లో చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎస్ఎన్ మూర్తి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఎఫ్‌వో రవీంద్ర ధామ, భవిత జిల్లా స్థాయి అధికారులతో కలిసి పాపికొండలు నేషనల్ పార్కు విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాపికొండలు నేషనల్ పార్కు ఏర్పాటుకు సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల్లోని 10 గ్రామాలు, చింతూరు డివిజన్లో 12 గ్రామాలు ఉన్నట్టు తెలిపారు. గ్రామసభలు ఏర్పాటుచేసే గ్రామాల ప్రజలకు ముందుగా నోటీసులు జారీ చేయా లన్నారు. నేషనల్ పార్కు ప్రాంతంలో ఎన్ని కుటుంబాలకు అవార్డులు మంజూరైంది.... ఇంకా ఎన్ని కుటుంబాలకు మంజూరు కావాల్సి ఉందో తెలపాలన్నారు. త్వరితగతిన గ్రామసభలు నిర్వహించాలని డీఎల్పీవో పద్మను ఆదేశించారు. సమావేశంలో సబ్ డీఎఫ్‌వోలు అనూష, రాఘవ, అటవీ రేంజ్ అధికారులు ఏడుకొండలు, ఫిరోజ్, డి.కొండలరావు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, డీఈ సాయిసతీష్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, ఎన్జీవో ప్రతినిధి గొర్లె అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు త్వరలో ధర్మకర్తలు

- దేవదాయ శాఖలో మూడు స్థాయిల్లో కమిటీల నియామకం
- వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో ధర్మకర్తల నియామకం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుతగా అర్చక బృందం ఆలయంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు మంత్రిని సత్కరించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంత్రికి స్వామివారి చిత్రపటం అందజేశారు. అనంతరం రూ.30 లక్షలతో నిర్మిస్తున్న రథశాలకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవదాయ శాఖలో మూడు స్థాయిల్లో కమిటీల నియామకం మరో పదిరోజుల్లో జరుగుతాయన్నారు. తొలివిడతగా ఏసీ స్థాయి, గ్రేడ్-1 స్థాయి కమిటీల నియామకం జరుగుతుందని, తద్వారా మిగిలిన కమిటీలు త్వరగా నియామకం చేస్తామన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు భక్తజనంతో విరజిల్లుతున్న వాడపల్లి క్షేత్రంపై క్యాబినెట్‌లో చర్చించారన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. త్వరలోనే దేవదాయ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కూనంపూడి రామకృష్ణంరాజు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మద్దూరి సుబ్బారావు, పి.వుల్లంరాజు వర్మ, జుజ్జవరపు హరిబాబు, మద్దింశెట్టి సత్యనారాయణ, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము, తహసీల్దారు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఐటీఐ విద్యార్థి

- సత్కరించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



ఐటీఐ విద్యార్థి, డీసీపీయూ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ బస్ డిపో సమీపంలో గత మంగళవారం ఏ దిక్కు లేకుండా ముగ్గురు చిన్నారులతో కలిసి వర్షంలో ఆకలితో ఉన్న రామలక్ష్మిని చూసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కుందూరుకు చెందిన ఐటీఐ విద్యార్థి వనుము పరమేశ్వర్ చలించిపోయాడు. ఈ విషయమై జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి(డీసీపీయూ) సమాచారం ఇవ్వడంతో ఆ మహిళతో పాటు ముగ్గురు చిన్నారులను జీజీహెచ్ వద్ద ఉన్న వన్‌స్టాప్‌కు తీసుకెళ్లి సపర్యలు చేసి చికిత్స అందించారు. బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు సఖి వన్ స్టాప్ సెంటర్‌కు తరలించి సంరక్షణ కల్పించారు. విషయం తెలుసుకున్న ఐటీఐ విద్యార్థి పరమేశ్వర్, ప్రొటెక్షన్ అధికారి విజయలను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం సత్కరించారు. ఆపదలో ఉన్న మహిళ, చిన్నారుల దుస్థితిని చూసి వెంటనే స్పందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, డీసీపీయూ కౌన్సిలర్ దుర్గారాణి, సోషల్ వర్కర్ చినబాబు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్కిల్ హబ్‌లో

ఉద్యోగ, ఉపాధి శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్ మే 22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్ భవన ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారికి అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ వృత్తి శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తరగతులు త్వరలో ప్రారంభమౌతున్నాయని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జున్నూరు రాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అర్బన్ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎన్.రాజా కాలేబ్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు నెలలపాటు జరిగే ఈ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు ఫ్యాకల్టీ మోత కనకదుర్గ మహాలక్ష్మిని, 62811 14627, 95537 94729 నెంబర్లతో సంప్రదించాలని తెలిపారు.

బిడ్డ కోసం తల్లి ఆవేదనే 'జనరల్ బోగీలు'

- ప్రేమానురాగాల విలువను తెలియజేసిన 'కిడ్నాప్'
- రామవరంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు



జనరల్ బోగీలు నాటికలో ఓ సన్నివేశం

అనపర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ 36వ జాతీయ స్థాయి నాటిక పోటీల్లో బుధవారం రాత్రి ప్రదర్శించిన సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు, ఉషోదయా కళానికేతన్ వారు ప్రదర్శించిన కిడ్నాప్ నాటికలు ఆకట్టుకున్నాయి. జనరల్ బోగీలు నాటికలో.. కొడుకు ప్రయాణిస్తున్న రైలు ప్రమాదానికి గురై అతడి ఆచూకీ లభించదు. బిడ్డ ఆచూకీ కోసం ఓ తల్లి ఐదేళ్ల పాటు పోరాటం సాగించి అనేక అవమానాలు ఎదుర్కోవడంతోపాటు చివరకు చెరశాలకు వెళుతుంది. ఈ నాటికను కొలకలూరుకు చెందిన సాయి ఆర్ట్స్ సం స్థ అద్భుతంగా ప్రదర్శించింది. కొడుకు ఆచూకీ కోసం పోలీసులకు ఆమెకు జరిగిన సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

భర్తను కొంగున కట్టుకుని, వృద్ధులైన అత్తమామలను నిత్యం ఏదో సాకుతో బాధ పెడుతుంది కోడలు. చివరకు వారు వేరు కాపురం పెడతారు. వియ్యంకుడు కూడా తన కూతురికి మాయ మాటలు చెబుతూ ఆర్థిక అవసరాలకు వాడుకుంటాడు. ఇదంతా నిశితంగా గమనిస్తున్న మనుమడు తన తల్లికి, తాతకు బుద్ధి రావాలని నాటకమాడి జ్ఞానోదయం కలిగించడమే కిడ్నాప్ సారాంశం. కత్రపాడుకు చెందిన ఉషోదయా కళానికేతన్ సంస్థ ప్రదర్శించిన ఈ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఇంజనీరింగ్ పరీక్షకు 115 మంది గైర్హాజరు

జేఎన్టీయూకే, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు గురువారం కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.

కాకినాడ జిల్లాలోని 5 కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 901 మంది విద్యార్థులకు 871 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 898 మంది విద్యార్థులకు 865 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 96.50 శాతం విద్యార్థులు పరీక్ష రాశారు.

తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 998 మంది విద్యార్థులకు 970 మంది హాజరై 28 మంది గైర్హాజరు కాగా 97.19 శాతం హాజరు నమోదైంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో 807 మంది విద్యార్థులకు 783 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. 97.03 శాతం హాజరు నమోదైంది. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతాయని కన్వీనర్ సుబ్బారావు చెప్పారు.

కొండ దిగి వెళ్లకపోతే

క్రిమినల్ కేసులు పెడతాం!

- అన్నవరం దేవస్థానంలో సేవకు వచ్చిన మంచిర్యాల భక్తులతో ఏఈవో దురుసు ప్రవర్తన
- 'ఏబీఎన్' కథనంతో సీఎంవో, ఇంటెలిజెన్స్ ఆరా
- స్టేట్‌మెంట్ రికార్డు, వివరాలు సేకరించిన ఈవో



కాకినాడ జిల్లా అన్నవరంలో ఈవోకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

అన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): వారంతా రాష్ట్రం దాటి అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో సేవ చేసేందుకు వచ్చారు. మధ్యవర్తి ద్వారా తునికి చెందిన శ్రీవారి సేవా సంఘం తరఫున దేవస్థానంలో రెండ్రోజులు సేవ నిర్వహించారు. ఈ సమయంలో కొందరు మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయం అన్నవరం దేవస్థానం ఏఈవో కొండలరావు దృష్టికి వెళ్లగా, ఆయన దురుసుగా మాట్లాడి కొండ దిగి వెళ్లకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరించారని మహిళలు ఆరోపించారు. దీనిపై ఏబీఎన్‌లో కథనం ప్రసారం కావడంతో పంచాయితీ.. ఇంటెలిజెన్స్, సీఎం కార్యాలయానికి చేరుకుంది. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల నుంచి 17 మంది మహిళలు, మరొక వ్యక్తి ఈ నెల 19న ఒక మధ్యవర్తి(మహిళ) ద్వారా కాకినాడ జిల్లా తునికి చెందిన శ్రీవారి సేవా సంఘం తరఫున అన్నవరం దేవస్థానంలో ఈ నెల 20, 21 తేదీల్లో రెండ్రోజులపాటు సేవ చేశారు. ఈ సమయంలో తుని శ్రీవారి సేవా సంఘానికి చెందిన ఇద్దరు మహిళలకు, మంచిర్యాల నుంచి వచ్చిన మహిళలకు చిన్నపాటి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రైలు ప్రయాణానికి రాను పోను ఖర్చులతోపాటు ఇతర ఖర్చుల కింద వేలల్లో చెల్లించామని మంచిర్యాల మహిళలు చెప్పడంతో ఈ విషయం బుధవారం సాయంత్రం దేవస్థానం ఏఈవో కొండలరావు దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే మంచిర్యాలకు చెందిన మహిళలపై మండిపడ్డారు. ఇలాంటి వ్యవహారాలు ఇక్కడ కుదరవని, తక్షణం కొండ దిగి వెళ్లిపోవాలని, లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరించడంతో వారు వెంటనే కొండ దిగి దేవస్థానానికి చెందిన సత్రంలో గదులు అద్దెకు తీసుకున్నారు. ఈ వ్యవహారంపై 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రసారమైంది. దీంతో సీఎంవో, ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగి దేవస్థానం ఈవోను వివరణ కోరారు. దీంతో ఈవో సుబ్బారావు ముందుగా మంచిర్యాల నుంచి వచ్చిన మహిళల వద్దకు ఆలయ సహాయ కమిషనర్, సీహెచ్ రామ్మోహనరావు, సూపరింటెండెంట్ రమణను పంపించి వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం ఈవో కార్యాలయం వద్దకు తీసుకొచ్చి దేవస్థానం డీసీ, ఏఈ వో సమక్షంలో వారి నుంచి వివరాలు సేకరించారు. సేవ చేసేందుకు వచ్చిన తమను అవమానకరంగా చూశారని, తమకు తిరుగు ప్రయాణం టికెట్లు కొంతమందికి 25వ తేదీ, మరికొంతమందికి 27వ తేదీన ఉన్నాయని తెలిపారు. అప్పటివరకు తమను సేవకులుగా కాకుండా భక్తులుగా అయినా ఉంచాలని కోరినా తుని శ్రీవారి సేవా సంఘానికి చెందిన రమ, విజయ అనుచితంగా ప్రవర్తించారని, వారికి ఏఈవో కొండలరావు వత్తాసు పలకడమే కాకుండా, వెంటనే కొండదిగి వెళ్లకపోతే మీకు ఎక్కడా సేవ దొరక్కుండా చేస్తామని బెదిరించారని ఈవోకు వివరించారు. దీంతో వారిద్దరిపై కేసులు నమోదు చేస్తామని, దేవస్థానం డార్మెటరీలో బస, భోజన ఏర్పాటు కల్పిస్తామని ఈవో హామీ ఇవ్వడంతో శాంతించారు.

సరస్వతి పుష్కరాలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు

- డిపో మేనేజర్ షేక్ షబ్నం



రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ఈనెల 22వ తేదీ శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి రెండు సూపర్‌లగ్జరీ బస్సులు బయలుదేరి వెడుతున్నాయని డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ యాత్రలో కాళేశ్వరం, ధర్మవరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్పక్షేత్రాలను దర్శించుకుని తిరిగి 25వ తేదీ రాజమహేంద్రవరం చేరుకుంటాయని ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో
విజేతలుగా ఉమ్మడి జిల్లా జట్లు

పిఠాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. చిత్తూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర 10వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొన్నాయి. వరుసగా ఐదోసారి బాలబాలికల విభాగాల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజేతలకు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయుడు, టెక్నికల్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబు షీల్డులు అందజేశారు. విజేతలను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మురాలశెట్టి సునీల్‌కుమార్, పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు, కె.సుందరకుమార్ అభినందించారు.




చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు

సత్యదేవుడికి ప్రముఖుల ప్రత్యేక పూజలు

అన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, సినీనటుడు సాయి కుమార్ కుటుంబసభ్యులతో వేర్వేరుగా స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


మంత్రి కొల్లు రవీంద్రకు స్వామి వారి ప్రసాదం, మెమెంటో అందజేస్తున్న ఈవో


సత్యదేవుడి దర్శనానంతరం సినీనటుడు సాయికుమార్



అన్నవరం అందాల హరివిల్లు మయం

కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి తూర్పురాజగోపురం వద్ద నల్లని మబ్బుల నడుమ అందాల హరివిల్లు ఆవిష్కృతమై భక్తులను కనువిందు చేసింది. ఈ చిత్రాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది

అన్నవరం (ఆంధ్రజ్యోతి)

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్లి గల్లంతైన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన మేరుగు శ్యామ్ (19) మృతదేహం లభ్యమైంది. సోమవారం శ్యామ్, మరో ఇద్దరు సముద్రంలోకి తెప్పపై వేటకు వెళ్లగా కెరటాల ఉధృతికి శ్యామ్ గల్లంతయ్యాడు. మిగతా ఇద్దరు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. తెప్ప తిరగబడిన చోటే గురువారం శ్యామ్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాడుబడిన బావిలో మృతదేహం

గోకవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): కుళ్లిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామంలో కోనేరు మధ్యలోని పాడుబడిన బావిలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. సుమారు 15 నుంచి 20రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 45 నుంచి 50 ఏళ్లలోపు ఉండవచ్చన్నారు. స్థానికంగా లేక చుట్టుపక్కల ప్రాంతంలో ఆచూకీ లేకుండా ఉన్న వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు.

పాముకాటుకు మహిళ మృతి

అమలాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు ఓ మహిళ మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోసంగివారిపేటలో గురువారం ఉదయం కొబ్బరితోటలో బహిర్భూమికి వెళ్లిన జల్లి రామలక్ష్మిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు అల్లవరం ఎస్‌ఐ టి.తిరుమలరావు తెలిపారు.

బావమరిదిని నరికిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

దేవరపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): బావమరిదిని నరికిన కేసులో వ్యక్తికి జైలు శిక్ష పడింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగరాయ కాలనీ బందపురం గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ బాజీ తన భార్య కాపురానికి రావడంలేదని కోపంతో దానికి కారణమైన తన బావమరిది షేక్ కరీమ్‌ని 2017లో కత్తితో నరికాడు. దీనిపై ఫిర్యాదు మేరకు దేవరపల్లి పోలీస్‌స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కొవ్వూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు నందు చార్జ్‌షీట్ ఫైల్ చేయగా సాక్షుల విచారణ అనంతరం కేసు రుజువుకావడంతో నిందితుడికి గురువారం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కాకులపాటి వెంకట్రామణ వాదించగా ప్రాసిక్యూషన్‌కు దేవరపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, కోర్టు కానిస్టేబుళ్లు సహకరించారు.

కాపవరం సర్పంచ్‌పై మూడు కేసులు

బిక్కవోలు, మే22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.విజయలక్ష్మిని వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన వైసీపీ సర్పంచ్ సత్యం శెట్టి వెంకటరమణపై మూడు కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. ఈ కేసును రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య విచారణ చేపట్టిన విషయం విదితమే. పంచాయతీ కార్యదర్శి పట్ల అసభ్యకరంగా మాట్లాడంపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు.. కార్యదర్శి విధులకు ఆటకం కలిగించడంపై సెక్షన్ 353.. కార్యదర్శిని వేధించినందుకు సెక్షన్ 506 కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

పది మందికి గాయాలు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాన్
- రాజానగరం వద్ద ఘటన
- క్షతగాత్రుల స్వగ్రామం ఏలూరు జిల్లా చెక్కపల్లి




సంఘటనా స్థలంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

రాజానగరం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యలో హైవేపై ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన పది మంది గాయపడ్డారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన నాగుల వెంకటేశ్వరరావు, నాగుల రాజ్యలక్ష్మి, బి.రఘుబాబు, బి.లక్ష్మీదుర్గ, తాళం రాధ, బి.దేవిక, బి.లోకేశ్వరరావు, బి.దేవేంద్ర, ఎస్.పావని ఒకే కుటుంబానికి చెందిన బంధువులు. వారంతా టాటా మ్యాజిక్ వ్యాన్‌లో కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలో రాజానగరం సమీపానికి వచ్చేసరికి హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్నవారంతా గాయపడ్డారు. డ్రైవర్ చింతల చెరువు మధుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించినట్టు రాజానగరం పోలీసులు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించినట్టు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు. వ్యాన్ డ్రైవర్ రెప్పపాటు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పిఠాపురంలో
కారు బీభత్సం

- అతివేగంగా వచ్చి మోటార్‌సైకిళ్లను ఢీకొనడంతో ధ్వంసం
- జాతీయ క్రీడాకారుడు సహా ముగ్గురికి తీవ్ర గాయాలు

పిఠాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌లో 216వ హైవేపై పాదగయ సెంటర్ వద్ద కారు బీభత్సం సృష్టించింది. మోటార్‌సైకిళ్లపైకి దూసుకెళ్లడంతో ధ్వంసమై ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ సంఘటన వాహనదారులను భీతావహులను చేసింది. పిఠాపురం ఇందిరానగర్‌కు చెందిన పోల్‌వాల్ట్ జాతీయ క్రీడాకారుడు పి.కృష్ణ, ఏడిద వెంకటేష్‌లు చిత్రాడలో జరిగిన బి.ప్రత్తిపాడుకు చెందిన కె.మహేంద్ర పెళ్లికి వెళ్లి సామర్లకోట రోడ్డు నుంచి మోటార్‌సైకిళ్లపై తిరిగి వస్తున్నారు. విశాఖపట్టణం నుంచి కాకినాడ వస్తున్న కారు అతివేగంగా రావడంతో పాటు అదుపుతప్పి వారిని ఢీకొని పాదగయ వద్ద పార్కింగ్‌లో ఉన్న మోటార్‌సైకిళ్లపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. మహేంద్ర పరిస్థితి విషమంగా ఉంది. పార్కింగ్‌లో ఉన్న 5 మోటారు సైకిళ్లు దెబ్బతిన్నాయి. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బీభత్సం సృష్టించిన కారు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

జీవ వైవిధ్య సంరక్షణతోనే సుస్థిరాభివృద్ధి

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్
- జైలులో జీవ వైవిధ్య దినోత్సవం


జైలులో మొక్కలు నాటుతున్న రాహుల్


వరి కంకుల కుచ్చులను కడుతున్న అధికారులు

రాజమహేంద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్య సంరక్షణతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా సెంట్రల్ జైలులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ గతేడాది సెంట్రల్ జైలుకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య పురస్కారం లభించిందని గుర్తుచేశారు. చారిత్రాత్మకమైన రాజమండ్రి సెంట్రల్ జైలులో జీవ వైవిధ్య సంరక్షణకు ఖైదీలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జైలులో వివిధ చెట్ల నుంచి రాలుతున్న ఆకులు, పువ్వులను నిత్యం సేకరించి సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నామన్నారు. వర్మీ యార్డులో వర్మీ కంపోస్టు కూడా తయారవుతోందన్నారు. వాడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను వివిధ రకాలుగా ఉపయోగిస్తున్నామన్నారు. 200 ఏళ్లకు పైబడిన చెట్లు కేంద్ర కారాగార ఆవరణలో ఉన్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంరక్షిస్తున్నామన్నారు. పచ్చదనం పరుచుకోవడంతో ఉడతలు, గోరింకలు, రామ చిలుకలు, కాకులు, కోయిలలు వంటి జీవాలు ఇక్కడ స్వేచ్ఛగా సంచరిస్తున్నాయని చెప్పారు. జైలు ఆవరణలో ఖైదీలతో మొక్కలు నాటించారు. పక్షుల ఆహారం కోసం వరి కంకుల కుచ్చులను, నీటిని ఏర్పాటు చేయించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకు జైలులో ప్రతి రోజూ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ వెల్లడించారు. డీఎస్ రత్నరాజు, పర్యావరణ మిత్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని బాలుడి మృతి

రౌతులపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన మోర్తా రమేష్‌బాబు (15) వ్యాన్ ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మెరక చామవరం గ్రామం నుంచి బైక్‌పై గెడ్డం ప్రసాద్, మోర్తా రమేష్‌బాబు వస్తుండగా రౌతులపూడి శివారు మరిడమ్మతల్లి ఆలయం దగ్గరకు వచ్చేసరికి రౌతులపూడి నుంచి శంఖవరం వెళ్తున్న బొలేరో వ్యాన్ బైక్‌ను ఢీకొనడంతో వెనక ఉన్న రమేష్‌బాబు కిందపడి తలకు బలమైన గాయమైంది. రౌతులపూడి ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోర్తా నాగేశ్వరరావు, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా రమేష్ బాబు చిన్న కుమారుడు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.


మరణించిన రమేష్‌బాబు(ఫైల్)

పరీక్ష రాసి ఇంటికెళ్తుండగా..

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొని తల్లీకూతుళ్లకు తీవ్రగాయాలు

పెద్దాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ ఎగ్జామ్ రాసి తిరిగి ఇంటికెళ్లే క్రమంలో ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను బలంగా ఢీకొని తల్లీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రోడ్డులో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తాళ్లరేవుకు చెందిన సాహితి ఈఏపీ సెట్ పరీక్ష రాసేందుకు సూరంపాలెంలోని ఆదిత్య కళాశాలకు తల్లితో కలిసి స్కూటీపై వచ్చింది. పరీక్ష రాసిన తర్వాత ఇంటికి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను అదుపుతప్పి వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. తల్లీకూతుళ్లు తీవ్రగాయాలు అయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఎస్‌ఐ మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో గాయపడిన తల్లి

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో భర్త మృతి

వై.రామవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పనసల పాలెం శివారు కల్వర్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రామవరంలో పని చేస్తున్న వీఆర్వో మిడియం కాంతమ్మ భర్త చోడి సీతారామయ్య (35) మరణించాడు. బుధవారం రాత్రి చవిటి దిబ్బలు వైపు నుంచి వై.రామవరం వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు చెప్తున్నారు. వాహనం అదుపు తప్పిందా లేక వేరే వాహనం ఢీకొందా అనే దానిపై స్పష్టత లేదు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.


మృతిచెందిన సీతారామయ్య

కాలువలోకి దూసుకెళ్లిన లారీ

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిపై కాలువలోకి లారీ దూసుకెళ్లింది. గురువారం తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ప్రత్తిపాడు సుద్దగడ్డ వాగు వద్ద అయ్యప్పస్వామి మైదానం ఎదురుగా ఉన్న కాలువలోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే అక్కడే 11కేవీ విద్యుత్ లైన్ల విద్యుత్ స్తంభం ఉంది. లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఉంటే ప్రమాదం జరిగేది. ఘటనలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.



ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్(ఏపీటీసీఎంవో) పద్మారాణి తెలిపారు. గురువారం ఆమె ఉప్పాడ తీరప్రాంతం, వీవర్స్ కాలనీలో పర్యటించారు. చేనేత కార్మికులు మగ్గాలపై తయారుచేస్తున్న చీరలు, వివిధ రకాల ఆల్బమ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉప్పాడ తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. విశాలమైన తీరప్రాంతంలో అనేకమంది మత్స్యకారులు బోట్లపై జీవనోపాధి పొందడం గుర్తించామన్నారు. ఉప్పాడలో చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి పెంపు, కార్మికుల జీవనోపాధి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై వివరాలను సేకరించి తద్వారా నివేదికను పంచాయతీరాజ్ శాఖకు సమర్పిస్తామని చెప్పారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యంతో ఉప్పాడ గ్రామాన్ని సందర్శించినట్టు చెప్పారు. టూరిజం కన్సల్టెంట్ నిష్టాగోయల్, క్రియేటివ్ డిజైనర్ మణికంఠ, కొత్తపల్లి ఎంపీడీవో పి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, చేనేత కార్మికులు ఉన్నారు.


ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న పద్మారాణి

మాధవరాయుడుపాలెం
సర్పంచ్‌కు జీవవైవిధ్య పురస్కారం

కడియం, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మక జీవవైవిధ్య పురస్కారం-2025 తూర్పుగోదావరి జిల్లా మాధవరాయుడుపాలెం సర్పంచ్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి అన్నందేవుల చంటికి దక్కింది. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జీవవైవిధ్యం కోసం కృషి చేసిన విశిష్ట వ్యక్తులను సత్కరించి పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నందేవుల చంటిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జీవవైవిధ్య పురస్కారం, జ్ఞాపిక అందజేశారు. ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, సోలార్ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉపయోగం, రోడ్డుకిరువైపులా మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందించడం తదితర అంశాల్లో 25ఏళ్లుగా చేస్తున్న కృషికి గాను చంటికి ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో జీవ వైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, మెంబర్ సెక్రటరీ రామకృష్ణ తదితరులున్నారు.



డిప్యూటీ సీఎం పవన్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న అన్నందేవుల చంటి

బాలికతో అసభ్య ప్రవర్తన..
గాజుల వ్యాపారిపై పోక్సో కేసు

సర్పవరం జంక్షన్, మే 22 (ఆంధ్రజ్యోతి): 12ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్‌ఐ లలితాదేవి తెలిపారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలో గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో వీధిలో తోపుడు బండి వద్దకు తల్లితో కలసి 12 ఏళ్ల బాలిక గాజులు, ఇతర సామాన్ల కొనుగోలు చేసేందుకు వచ్చింది. గాజులు చూస్తుండగా బాలికను వదిలి తల్లి ఇంట్లోకి వెళ్లింది. ఈ సమయంలో తోపుడు గాజుల బండి వ్యాపారి కంచెపు సూర్యప్రభాకర్ (50) బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఏడుస్తూ ఇంట్లోకి వెళ్లి జరిగిన సంఘటనపై తల్లికి చెప్పింది. సూర్యప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బి పెద్దిరాజు ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు మహిళా ఎస్‌ఐ లలితాదేవి తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గొల్లప్రోలులో ఎండీయూ ఆపరేటర్ల ధర్నా

గొల్లప్రోలు, మే 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ వాహనాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎండీయూ ఆపరేటర్లు గురువారం ధర్నా నిర్వహించారు. తమ పొట్టకొట్టవద్దని వారు ప్రభుత్వాన్ని కోరారు. వారికి కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ సంఘీభావం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

యోగాంధ్రను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి

కలెక్టరేట్ (కాకినాడ), మే 22 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025ను ప్రణాళికాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్రలో భాగంగా నిర్వహించనున్న యోగా శిక్షణ తరగతులు, వివిధ రకాల పోటీల నిర్వహణపై గురువారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 24వతేదీ నుంచి ప్రతిరోజూ యోగాపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో మే 26 నుంచి 29 వరకు, మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7 వరకు, జిల్లా స్థాయిలో జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. శిక్షణ తరగతులకు యోగా ట్రైనర్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ అలీ, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, కాకినాడ కార్పొరేషన్ ఎస్ఈ వెంకటరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు, రక్తదాతలు

గొల్లప్రోలులో రక్తదాన శిబిరం

గొల్లప్రోలు, మే 22 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నూతన తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం తలసీమియా చిన్నారుల కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వచ్చి రక్తదానం చేశారు. శిబిరాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించగా తహసీల్దారు సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.


చేబ్రోలులో సమావేశమైన పట్టు రైతులు

'ఇన్సెంటివ్ బకాయిలు తక్షణం చెల్లించాలి'

గొల్లప్రోలు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టు రైతులకు నాలుగేళ్లుగా చెల్లించాల్సిన ఇన్సెంటివ్ బకాయిలను తక్షణం చెల్లించాలని, ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తదుపరి కార్యాచరణ చేపట్టాలని రైతులు నిర్ణయించారు. చేబ్రోలులోని సెరీకల్చర్ ఫామ్‌లో గురువారం పట్టు రైతులు సమావేశమయ్యారు. కలెక్టర్‌ను కలిసిన సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు, పట్టుపరిశ్రమ శాఖ డీడీ రైతులకు వ్యతిరేకంగా కలెక్టరుకు తప్పుడు సమాచారం ఇవ్వడం తదితర అంశాలపై చర్చించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు వారి సమస్యలను పట్టించుకోని జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఉలకాయల రాంబాబు, ఓరుగంటి సందీప్, శ్రీను, చల్లా రామకృష్ణ, ఎలుగుబంటి బాబులు పాల్గొన్నారు.


సామర్లకోటలో ఆంజనేయస్వామి, పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురంలో అభయాంజనేయస్వామి, గొల్లప్రోలు మండలం దుర్గాడలో దాసాంజనేయస్వామి

భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి

సామర్లకోట, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా కంచి మహా సంస్థానం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం చెంతన గల ఆంజనేయస్వామి ఆలయంలో వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు మహంకాళి వెంకటరమణ అవధాని, ఇంద్రగంటి సోమయాజులు పర్యవేక్షణలో స్వామివారిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. సహస్రనామార్చన, లక్ష తమలపాకులతో విశేష అర్చన జరిపారు. సాయంత్రం ఆంజనేయ, దత్త హోమాలు నిర్వహించారు. రాత్రి ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం శిరస్సు పైభాగం నుంచి లక్ష పుష్పార్చన, లక్ష తమలపాకులతో అభిషేకాన్ని భక్తుల జై వీరాంజనేయ, జై ప్రసన్నాంజనేయ నినాదాల నడుమ ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలుతిమ్మాపురం అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దాపురం మెయిన్‌రోడ్డులోని దాసాంజనేయస్వామికి సింధూరం, తమలపాకుల పూజలు చేసి భజన జరిపారు. పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారంలో గల అనఘా దత్త క్షేత్రంలో 108సార్లు సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం జరిగింది. సరిహద్దుల్లో పోరాడుతున్న మన సైనికులకు మరింత మనోధైర్యం ప్రసాదించాలని కోరుతూ విశ్వహైందవ పరిషత్, జై హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రార్థనలతో పాటు పారాయణ చేశారు. దేశ నాయకత్వానికి హనుమాన్ ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, చెల్లుబోయిన సతీష్, నిర్వాహకులు దువ్వా వెంకటేశ్వరరావు, మణికుమార్, సురేంద్రదత్త తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, అగ్రహారం, జగ్గయ్యచెరువు కాలనీ తదితర ప్రాంతాల్లోని హనుమాన్ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర పూజలు జరిగాయి. స్వామికి తమలపాకుల మాలలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఆలయ కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించాయి.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో దాసాంజనేయస్వామికి మన్యసూక్త పారాయణతో పంచామృతాలు, సుగంధ జలాలతో అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు అభిషేకాలు నిర్వహించారు. తమలపాకులు, సింధూరం, సహస్రనామాలతో పూజలు జరిగాయి. అప్పాలు, గారెలు, వివిధ రకాల పిండి వంటలను స్వామికి సమర్పించి అలంకారం చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట, మార్కండేయపురం, బస్టాండు ప్రాంతాల్లో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తపేట రామాయమ్మరావుపేటలో ఏకాహంలో జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొని భక్త భజన సమాజాల సభ్యులతో కలిసి భజన చేశారు.


సైనికులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తూ పిఠాపురంలో 108 సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు, గొల్లప్రోలు కొత్తపేటలో నిర్వహించిన ఏకాహంలో పాల్గొని భజన చేస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

హనుమాన్ శోభా యాత్ర

పెద్దాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాషాయమైన కూడళ్లు, జైశ్రీరామ్ నినాదాలు, భజన కీర్తనలు, భక్తజన పరవళ్లు.. వెరసి అశేష జనవాహిని కదలిరాగా హనుమాన్ శోభాయాత్ర సాగింది. హనుమాన్ శోభా యాత్ర కమిటీ, పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో హనుమాన్ శోభా యాత్ర పేరుతో భారీ మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. సుమారు 8 కిలోమీటర్ల మేర సాగిన యాత్రలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వందలాదిగా ప్రజలు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): వందలాది మంది భక్తులు కాషాయ జెండాలు చేతబట్టి జైశ్రీరామ్ నినాదాలతో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్నారు. శృంగవృక్షం దత్త పీఠాధిపతి సాయి దత్త నాగనంద సరస్వతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. మోటారు సైకిళ్లపై పెద్దాపురం రోడ్డు నుంచి బ్రౌన్‌పేట, బళ్ల మార్కెట్ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, స్టేషన్ సెంటర్, మఠం సెంటర్, మెహెర్ కాంప్లెక్స్ మీదుగా ఆలయానికి చేరుకున్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. త్రివిధ దళాలకు బాసటగా నిలుస్తూ వారి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ, హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు పాల్గొన్నారు.


సామర్లకోటలో భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న సాయి దత్త నాగానంద సరస్వతి స్వామి, పెద్దాపురంలో హనుమాన్ శోభా యాత్రలో పాల్గొన్న ప్రజలు


పిఠాపురం సీఐ శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

హత్య కేసును ఛేధించిన అధికారులకు ప్రశంసాపత్రాలు

గొల్లప్రోలు, మే 22 (ఆంధ్రజ్యోతి): హత్య కేసును ఛేధించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ బిందుమాధవ్ అభినందించడంతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌లో మార్చి 3న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించడం, దానిపై ఉన్న గాయాల ఆధారంగా హత్యకు గురైనట్టు గుర్తించి ప్రత్యేక బృందాల ద్వారా దర్యాప్తు చేశారు. భార్య, ప్రియుడు, మరో వ్యక్తి హత్య చేసినట్టు గుర్తించి వారిని అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారి, పిఠాపురం సీఐ శ్రీనివాస్, దర్యాప్తు బృందం సభ్యులైన గొల్లప్రోలు, పిఠాపురం ఎస్ఐలు ఎన్.రామకృష్ణ, మణికుమార్, సిబ్బంది పి.శ్రీనివాసరావు, వి.విజయబాబుకుమార్, ఎస్.బాలాజీ, ఎం.శ్రీనివాసరావు, ఎంపీఎస్ రాఘవలను ఎస్పీ అభినందించారు.


గొల్లప్రోలు, పిఠాపురం ఎస్ఐలు రామకృష్ణ, మణికుమార్‌లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు

జీజీహెచ్ (కాకినాడ), మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గైగోలుపాడులోని జెట్ల పెద్దకాపు వీధిలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు (ఈహెచ్ఆర్)లో రోగికి ఏబీహెచ్ఏ ఐడీని ఆన్‌లైన్‌లో ఏ విధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. రిజిస్టర్, ల్యాబ్ రూమ్, డెలివరీ రూమ్‌లను చూశారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించి ఏఎన్ఎంలు అన్ని పోర్టర్లలో పూర్తి వివరాలను నూటికి నూరు శాతం అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.


రోగిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్

కుమారరామ భీమేశ్వరాలయంలో యోగాసనాలు

సామర్లకోట, మే 22 (ఆంధ్రజ్యోతి): కుమారరామ భీమేశ్వరాలయంలో యోగా మాసోత్సవంలో భాగంగా గురువారం సామాజిక, ధార్మిక పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రేపాక వెంకట దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో భక్తులకు ఉచిత యోగాసనాలను వివరించారు. యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు పూర్తిగా తగ్గిపోతాయని వివరించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఈశ్వర రావు, ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడు సభకు కాకినాడ తరలిన తెలుగు తమ్ముళ్లు

సామర్లకోట, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గురువారం జరిగిన టీడీపీ మినీ మహానాడు సభకు సామర్లకోట మండలం, పట్టణం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వేట్లపాలెం మహాలక్ష్మి ఆలయ సెంటరు నుంచి కార్యకర్తలు ర్యాలీగా బయల్దేరగా... సామర్లకోట మఠం సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి అనేక మంది వెళ్లారు. తెలుగుదేశం పార్టీ జెండాలను సైకిల్‌పై పెట్టి పలువురు మోటారు సైకిళ్లపై ర్యాలీగా బయల్దేరారు.

కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఇసుకపల్లిలో శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు గురువారం జరిగాయి. గ్రామానికి చెందిన వాకాడ వీరరాఘవులు-ఉషారాణి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్య శర్మ వేదమంత్రోచ్చారణలతో హోమం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న భారత సైనికులకు మనోధైర్యం కలగాలని, హనుమంతుడు శక్తి, ఆశీర్వాదాలు దేశ ప్రజలకు, సైన్యానికి ఉండాలనే సంకల్పంతో హోమం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


సీతాలక్ష్మి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎంపీ సతీష్‌బాబు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సామర్లకోట/కాకినాడ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం పాలైన సామర్లకోట మండలం జి.మేడపాడుకు చెందిన మల్యాల సీతాలక్ష్మికి మెరుగైన వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.55,206 మంజూరైంది. ఈ మేరకు చెక్కును ఆమె భర్తకు గురువారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కొప్పవరంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. వేట్లపాలెం మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనువాసులు. ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.


మల్లవరంలో పంట కాల్వ పనులను ప్రారంభిస్తున్న సునీల్‌కుమార్

పంట కాల్వ పనులు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం మల్లవరంలో రూ.10లక్షలతో పంట కాల్వల పనులను గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ గురువారం ప్రారంభించారు. రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు, కూటమి నాయకులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఆరా తీస్తున్న ఆర్డీవో శ్రీరమణి

హౌసింగ్ లే-ఔట్ల పరిశీలన

పెద్దాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ కొత్తూరు, వడ్లమూరు గ్రామాల్లో ఇళ్ల లే-ఔట్లను ఆర్డీవో కె.శ్రీరమణి గురువారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులు చైతన్యవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శ్రీలలిత, హౌసింగ్ ఈఈ గుప్తా, డీఈ సువర్ణరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర పట్నం 11కేవీ, ఇర్రిపాక ఫీడర్ 11కేవీ ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇర్రిపాక, నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాలకు బోరులకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ వీరభద్రరావు పేర్కొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

● జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, మే 22(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా రైతు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంతో కలిసి ఏడు మండలాల రైతు ఉత్పత్తుల సంఘం ప్రతినిధులు, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలు రైతు ఉత్పత్తి సంఘాలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలని అందుకు ఎన్జీవోల సపోర్టు తీసుకుంటామన్నారు. రైతుల అభివృద్ధికి, రైతు ఉత్పత్తి సంఘాల అభివృద్ధికి ఏం కావాలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. గతంలో రుణాలు తీసుకున్న సంఘాలు ఏఏ వ్యాపారాలు చేస్తున్నారో, ఎన్ని టన్నుల జీడిపిక్కలు కొనుగోలు చేశారో మండలాల వారీగా సమీక్షించారు. రైతు ఉత్పత్తి సంఘాలకు విద్యుత్, వివిధ రకాల వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలకు ఎరువులు, గొడౌన్లు ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏపీడీ డేగలయ్య, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, మండల వ్యవసాయశాఖాధికారి కె.లక్ష్మణ్, వెలుగు డీపీఎం పరమేశ్వరరావు, ఈఈ రవికుమార్, ఎన్జీవోలు, రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరిగిందలపాడు ఆయకట్టు ప్రతిపాదనలు సమర్పించాలి

మండలంలోని సిరిగిందలపాడు ఆయకట్టు పూడికతీత, మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీపీ బందం శ్రీదేవి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఎఫ్‌వో రవీంద్రదామలతో కలిసి ఆయకట్టును పరిశీలించారు. ఈ ఆయకట్టు ద్వారా పందిరిమామిడి, జాగరంపల్లి గ్రామాల్లోని సుమారు 450 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగా బొజ్జయ్య, తహశీల్దారు పి.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, ఏపీడీ బి.సత్యనారాయణ, ఏఈ సాయి చందు, ఆర్ఐ నిర్మల, సీడీపీవో సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల ప్యాకేజీ అమలుకు చర్యలు

● జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, మే 22(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు నిబంధనల ప్రకారం ప్యాకేజీ అమలు చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, ఎల్ఎంసీ స్పెషల్ కలెక్టర్ సరళ వందనంతో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల ఏర్పాటుకు చింతూరు డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించేందుకు సర్వే, రెవెన్యూ టీంలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గిరిజనులకు వ్యవసాయానికి అనువుగా ఉన్న భూములను, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రైవేట్ భూములను గుర్తించాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేడ్కర్, వెంకటేశ్వర్లు, నరసయ్య, తహసీల్దార్లు సీహెచ్ శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, ఏవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్లు తేజశ్విని, భాష, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ ఐక్యత సాధ్యం

మోతుగూడెం, మే22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు మట్టం శాంతకుమారి, పార్టీ జిల్లా నాయకులు చొల్ల బుజ్జిరెడ్డి, ఉయిక బుల్లి కొండలు దొర, డివిజన్ అధ్యక్షులు కారం రామన్నదొర నాలుగు మండల నాయకులను కలుస్తూ వీఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చింతూరులో బీజేపీ ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి శాంతకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ఏడు మండలాల గ్రామాలకు పోలవరం ప్యాకేజీ ఇస్తుందని, స్పెషల్ డీఎస్సీని నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, విద్యాభివృద్ధికి పెంచిందన్నారు. ఏజెన్సీలో జాతీయ రహదారులు, మంచినీరు, వైద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధి నిధులు పెంచిందన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం సిందూర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి భారతదేశ ఖ్యాతిని రక్షణ రంగంలో గొప్పతనాన్ని చాటిందన్నారు. బీజేపీ మాత్రమే దేశ ఐక్యత, అభివృద్ధి, జాతి ఐక్యతను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నోముల రామా రావు, పాయం వెంకయ్య. పార్టీ మండల అధ్యక్షులు డీవీఎస్ రమణారెడ్డి. మండల సీనియర్ నాయకులు కట్ట ముత్తయ్య, ఎం.మల్లేష్, శ్యామల లక్ష్మణరావు. ఎం.శ్రీను, మీడియా ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



ఎటపాక: గన్నవరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పొల్లూరులో హనుమాన్‌కు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



వీఆర్ పురంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎటపాక, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలంలో పలు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గన్నవరం, సీతాపురం, నెల్లిపాక, నందిగామ, ఎటపాక, గౌరిదేవిపేట తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని జరుపుకున్నారు. భక్తులు అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అభయాంజనేయ స్వామి వారికి అభిషేకాలు, పూజలు జరిపారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న దబ్బగూడెంలో బుధవారం అర్చకులు పవన్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లోయర్ సీలేరులో ఏపీ జెన్‌కో సివిల్ ఏడీఏ కొండబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోతుగూడెం మార్కెట్ సెంటర్‌లో, పొల్లూరులో ప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో శ్రీదుర్గా మల్లేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు సతీష్ రాఘవన్, పిల్లే పేపకాయల శ్రీను, శివరామకృష్ణ, నాని, సత్యారావు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: వీఆర్‌పురంలోని బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని గురువారం వైభవంగా జరుపుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చింతరేవుపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలోను హనుమాన్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గూటాల పుల్లేష్, ఎ.నాగేశ్వరరావు, లొల్లా సుధాకర్, అలజింగ శైలు, వేటకాని అచ్చన్న, సోడి సాదయ్య, లక్ష్మణరావు, గూటాల కిట్టు, లొల్లా సాయి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంపై చర్యలు

కూనవరం, మే 22(ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కూనవరం వెలు గు ఏపీఎంపై చర్యలు తీసుకోనున్నట్లు వెలుగు ఏపీడీ డేగలయ్య తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో విధులకు ఏపీఎం డుమ్మా శీర్షికతో ఒక కథనం వెలువడిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వెలుగు ఏపీఎం శ్యామ్‌బాబుకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు అందచేసామన్నారు. చింతూరు ఐటీడీఏ పీవోకు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. త్వరలోనే కూనవరం వెలుగు కార్యాలయానికి కొత్తగా మరో ఏపీఎంను నియమిస్తున్నట్లు తెలిపారు.



మల్లేపల్లిలో కోలాట నృత్యాలు



శంఖవరంలో పూజలు చేస్తున్న భక్తులు



కోటనందూరులో పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా హనుమాన్ జయంతి

● ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గండేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో, హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం కమిటీ సభ్యులు దార్లంక శ్రీనివాసరావు, జాజిమొగ్గల సత్యనారాయణ, వలభశెట్టి చక్రరావు, అక్కిరెడ్డి సత్తిబాబు, తెమ్మన బోయిన జయనానాజీ, పి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. స్వామివారిని గ్రామమంతా తీన్మార్, కోలాటం నృత్యాలు, రాయుడుసీత హనుమాన్ పలు వేషధారణలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆలయప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గండేపల్లి చెరువుగట్టు వద్ద వెలిసిన వద్ద వెలిసిన ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వేడుకలు జరిగాయి

శంఖవరం: హనుమాన్ జయంతి సందర్భంగా కత్తిపూడి, శంఖవరం, వజ్రకూటం గ్రామాల్లో స్వామివారికి తమలపాకులతో దండలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు పూజలు చేశారు. రౌతులపూడి మార్కెట్ నందు గల ఆంజనేయస్వామి ఆలయం వద్ద వ్యవసాయ కూలీ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కోటనందూరు: అల్లిపూడి, బిళ్లనందూరు, కోటనందూరు, జగన్నాథపురం, కాకరపల్లి బొద్దవరం, కేఈ చిన్నాయిపాలెం, తదితర గ్రామాల్లో హనుమాన్ ఆలయాల వద్ద కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలు నిర్వహించారు.

ఏలేశ్వరం: పట్టణంలోని షిర్డీనగర్ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కోరాడ శ్రీనివాసరావు సుగుణ దంపతులతో విఘ్నేశ్వస్వామి పూజ, పంచామృత అభిషేకం, తమలపాకులు, సింధూరంతో పూజ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సిరిపురంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేకపూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, చిక్కాల లక్ష్మణరావు, పైల విజయ్ కుమార్, కొప్పుల బాబ్జీ, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రత్తిపాడు: మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మవరంలోని కోల్డ్ స్టోరేజ్ సమీపంలో నవ పవర్ ప్లాంట్ వద్ద ఉన్న ఆంజనేయుడికి ప్రజలు పూజలు నిర్వహించారు. ధర్మవరం సానా నూకరాజు నాయుడు భజన బృందం ఈ ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్తిపాడు, రాచపల్లి, గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలు వద్ద చెక్‌పోస్ట్ సెంటర్ పంచముఖఆంజనేయ స్వామి ఆలయం, ధర్మవరం హనుమాన్ కాలనీ ఆంజనేయుని ఆలయం వద్ద పూజలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

తొండంగి: ఏ కొత్తపల్లి కదంబ క్షేత్రంలో ఆంజనేయ స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిగాయి. తొండంగి, శృంగవృక్షం గోపాలపట్నం, ఏవినగరం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. బెండపూడిలో సామూహిక హనుమాన్ ఛాలీసా పారాయణ జరిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ..



ప్రత్తిపాడు: ధర్మవరంలో ...



కదంబ క్షేత్రంలో పూజలందుకున్న దృశ్యం

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను కేంద్రప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని, ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్ చేసింది. ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్ దారుణమని, నరహంతక చర్యలు ఖండిస్తున్నామని ప్రత్తిపాడులో గురువారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ, సీపీఐ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు, ఇతర కార్యకర్తలను ఆదివాసీ ప్రజలను ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపుర్, నిజాంపూర్ జిల్లాలో చట్టవ్యతిరేకంగా హత్యలు గావించడాన్ని లిబరేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మావోయిస్టులు ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించారని, మావోయిస్టులపై సైనిక కార్యకలాపాలు నిలిపివేయాలని కోరారు.

నిబద్ధత కలిగిన నాయకుడు 'యనమల'



తునిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుని రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత కలిగిన నాయకుడు తమ నేత యనమల రామకృష్ణుడని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. తునిలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల మాజీ మంత్రి దాడిశెట్టి రాజా విలేకర్ల సమావేశంలో మాట్లాడిన మాటలపై మండిపడ్డారు. యనమలపై దాడిశెట్టి రాజా అర్థం లేని విమర్శలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని చెప్పారు. అవినీతి అక్రమాలు మీకే సొంతమని, యాదవ సామాజిక వర్గానికి చెందిన అమాయక ప్రజల నుంచి గొర్రెల లోను పేరిట రూ.5కోట్లు కాజేసిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. తప్పుడు కేసులు బనాయించే నీతిమాలిన సంస్కృతి తమ నాయకుడుకు లేదన్నారు. టీడీపీ నేతలు చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, యినిగంటి సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి,లంక సునీల్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు 24న కౌన్సెలింగ్

రంపచోడవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 8 గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 24న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగదయ్య తెలిపారు. బాలికలకు 540, బాలురకు 490 సీట్లు ఉన్నాయని మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. బాలికలకు రంపచోడవరం గురుకుల బాలికల కళాశాల, బాలురకు రంపచోడవరం గురుకుల బాలుర కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



ప్రత్తిపాడులో వరుపుల రాజా విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జిల్లా మహానాడుకు గురువారం ప్రత్తిపాడు నుంచి 300 మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో వారంతా 80 కార్లలో భారీ కాన్వాయ్‌గా ఇక్కడ నుంచి బయల్దేరారు. తెలుగు పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఎమ్మెల్యే ర్యాలీగా హైస్కూల్ రోడ్డు జంక్షన్‌కు తరలివచ్చి అక్కడ నుంచి తన భర్త దివంగత వరుపుల రాజా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో అప్పనపాలెం వంతెన, రౌతులపూడి మండలంలో ధ్వంసమైన చెక్ డ్యామ్‌లు, నియోజకవర్గానికి అవసరమైన డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు వంటి సమస్యలను తీర్మానించి రాష్ట్ర మహానాడుకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, వెన్నా శివ, పల్లా గోపి, వెలుగుల నాని, గొల్లపల్లి బుజ్జి, బస్వా ప్రసాద్, పోలిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీపీ



ప్రత్తిపాడులో ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుధాకర్

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో కార్యాలయ ఛాంబర్‌ను నూతనంగా ఆధునీకరించి పనులు పూర్తి చేయడంతో గురువారం ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్ ప్రారంభించారు. కార్యాలయం అధ్వానంగా ఉండటం వల్ల ఎంపీడీవో కుమార్‌బాబును కార్యాలయాన్ని ఆధునీకరించాలని సూచించామన్నారు. అనంతరం ఎంపీపీ సుధాకర్‌ను ఎంపీడీవో కుమార్‌బాబు, ఈవోపీ ఆర్డీ కాశీ విశ్వనాథ్, ఏపీఎం వెంకట్, ఏపీవో కుమార్ స్వామి, కార్యదర్శులు వి.వీరబాబు, ఎం. లక్ష్మీనారాయణ, వెంకటరమణ, గంగాభవాని ఘనంగా సన్మానించారు.

పీఎండీఎస్ సాగుతో పంటలకు మేలు

శంఖవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): పీఎండీఎస్ సాగుతో పంటలకు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. వి.వెంకటాపురం, శంఖవరం, గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రిమాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతిలో సాగుచేస్తున్న పంటలను పరిశీలించి సూచనలిచ్చారు. ఈ పద్ధతిలో పొలంలో సుమారు 20-30 రకాల పంటల విత్తనాలు వెదజల్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, సోమరాజు, లోవలక్ష్మి, బాబూరావు, సుబ్బారావు రమణ పాల్గొన్నారు.

చురుగ్గా సరిహద్దు వంతెన నిర్మాణ పనులు

మోతుగూడెం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాల మధ్య సీలేరు నదిపై పొల్లూరు పడవ రేవు వద్ద నిర్మిస్తున్న సరిహద్దు వంతెన పనులు వేగం పుంజుకున్నాయి. చింతూరు మండల మోతుగూడెం పంచాయతీ పొల్లూరు జలపాతం వద్ద ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మన్యం కొండ జాతరను తిలకించడానికి ఒడిశా రాష్ట్రం నుంచి వేలాదిగా వస్తుంటారు. వీరి సౌకర్యార్థం ఒడిశా ప్రభుత్వం 2021లో రూ.10 కోట్లతో సీలేరు నదిపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నాలుగేళ్ళుగా నత్తనడక సాగిన పనులు ఒక్కసారిగా వేగం పుంజుకున్నాయి. ప్రస్తుతం మొత్తం తొమ్మిది స్థంబాలకు అయిదింటిని కాంట్రాక్టర్ పూర్తిచేసి వాటిపై శ్లాబులు వేస్తున్నారు. 2027 ఫిబ్రవరిలో నిర్వహించే మన్యం కొండ జాతరకు (బడా జాతర) భక్తులు, వాహనాల రాకపోకలకు అందుబాటులో ఉంటుందని సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే ఒడిశా రాష్ట్రంలోని పలు పట్టణాలకు ఆంధ్రా నుంచి అతి తక్కువ సమయంలోనే ప్రయాణించవచ్చని అధికారులు చెబుతున్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్యామ్‌ప్రసాద్ ఎన్నిక



ఎటపాక, మే 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎటపాక మండలాధ్యక్షుడిగా నలజాల శ్యామ్‌ప్రసాద్ ఎన్నికయ్యారు. గురువారం నెల్లిపాక గ్రామంలో నిర్వహించిన ఆపార్టీ కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్నికైన శ్యామ్‌ప్రసాద్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, రంపచోడవరం అసెంబ్లీ కన్వీనర్ బుల్లి కొండలదొర, జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు కారం సీతారామన్న దొర, నాయకులు సతీష్, దుర్గారావు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ తరగతులు



యోగాను నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పోలీస్ సర్కిల్ పోలీస్ శాఖ ఉద్యోగులు, ప్రజలకు జగ్గంపేట కాపు కల్యాణ మండపంలో యోగా అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునందన్‌రావు, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, గండేపల్లి ఎస్.యువి శివనాగబాబు, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, మహిళా పోలీసులు నాగమణి, వెల్నెస్ కోచ్ శృతి, డిసూర్యలక్ష్మి, ఎన్.విశ్వనాథరాజు యోగా గురువులు సీతారామస్వామి, వి.భద్రం భోగిరాజు, ఆర్ఎస్ఎస్ పిల్లలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



సిరిపురంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, మే22 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జనసేన నేతలు అచ్చే గోవింద్, అచ్చే వీరబాబు నేతృత్వంలో కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులతో శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. సుమారు 160 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా వారిలో 30 మందిని ఆపరేషన్ నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి పంపినట్టు తెలిపారు.

ఉపాధి కూలీల గగ్గోలు

జగ్గంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ఏప్రిల్ నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో గగ్గోలు పెడుతున్నారని బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. గురువారం పంచాయతీ రాజ్ అతిథి గృహం వద్ద ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి కూలీ ఇవ్వలేదని కూలీలు చెప్పారన్నారు. వెంటనే కూలి సొమ్ములు చెల్లించాలని, అలాగే పనిచేసే చోట కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఈ విషయాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ రాజా

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నలుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.4,74,410 చెక్కులను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు, వ్యాధిగ్రస్తులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థికసహాయం చేసి ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నేతలు పర్వత సురేష్, బద్ది రామారావు, వెన్నా శివ, బద్ది రమణ, బదిరెడ్డి గోపి, వై.జగదీష్, మూది నారాయణ, గణేశుల వీరభద్రం పాల్గొన్నారు.

శంఖవరం: నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అందించారు. కత్తిపూడికి చెందిన కొయ్యా వీరసత్తియ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవలే మృతిచెందాడు. ఆయన కుటుంబానికి రూ. 1.86 లక్షలు, నెల్లిపూడికి చెందిన పిర్ల కృష్ణకు రూ. 41,000 చెక్కులను అందించారు. సీనియర్ నేత పర్వత సురేష్, టీడీపీ మండలాధ్యక్షులు బద్ది రామారావు, వెన్నా శివ, బద్ది రమణ, కొయ్య రమణ, కంచిబోయిన శ్రీను, బద్ది రామకృష్ణ పాల్గొన్నారు.